# బాలసాహిత్యం నీతి కథ

# నాలుగు వడ్లగింజలు

## నీతి కథ

నెల్లారు విజయకుమార్
M.A (తెలుగు)
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

# నాలుగు వడ్లగింజలు

## నీతి కథ

నెల్లూరు విజయకుమార్
**M.A** (తెలుగు)
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

ఒక ఊరిలో రామయ్య, సీతమ్మ అనే దంపతులు ఉన్నారు. వారిది చిన్నకాపురమే అయినా,ఇల్లు మాత్రం పెద్దది. ఆ ఇంటి లాగే వారి మనస్సులు కూడా పెద్దవే. ఆ ఇంటి చుట్టూ ప్రహరి ఉన్నది. వెనక పెరట్లో మంచి నీళ్ళ బావి ఉంది. ఇంటి ముందు అందంగా అమర్చిన తులసికోట, కనకాంబరం మొక్కలు ఉన్నాయి. దారినపోయేవా రికి ఆ ఇల్లు కనువిందు చేస్తుంది. రామయ్య సీతమ్మలు షష్టిపూర్తికి చేరువలో ఉన్నారు.

వీరి దాంపత్యం అందరికీ ఆదర్శప్రాయమైంది భార్యకు తగ్గట్టు భర్త. భర్తకు తగ్గట్టు భార్య నడుచుకొనే వారు అందువలన వారి సంసారంలో చిక్కులు, విడాకులు అన్న మాటల ప్రసక్తి రాలేదు. రామయ్య పెద్దగా చదువుకున్నవాడు కాకపోయినా సమయానికి తగ్గట్టు ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకోగలడు. పెద్దలు సంపాదించిన ఆస్తిని, తనపనితనంతో మరింత అబివృద్ధి పరుస్తాడు. అందుకు అతని భార్య ప్రోత్సాహం తోడైంది. వారు ఆ ఊరిలో గొప్ప రైతుకుటుంబీకులుగా ఎదిగారు.

వీళ్ళకి నలుగురు కొడకులు,పెద్దవాడి పేరు సురేంద్ర ఇతడూ పెద్దగా చదువుకోలేదు కానీ మంచి నేర్పరి. రెండవ వాడి పేరు సుభాష్ ఇతడు అన్నభతలోనే నడిచాడు కానీ సంస్కారం, వినయం ఉన్నవాడు. అన్నతోపాటు పొలంపనులు చూసుకునేవాడు. మూడవ వాని పేరు సుచరిత్. ఇతడికి వ్యాపారం బాగా కలసి వచ్చింది. అందువల్లనే సొంత ఊరిలోనే ఒక అంగడి పెట్టాడు. లాభాలు బాగానే వస్తున్నాయి. నాల్గవ వాని పేరు సుహృద్ ఇతడు మంచి తెలివిగలవాడు. డిగ్రీ దాకా చదివాడు. పై చదువు కోసం ప్రయత్నిస్తున్నాడు. సెలవుల్లో అన్నలకు పొలం పనిలో సహాయపడుతుండేవాడు. ఎంత చదువుకున్నా అతనిలో ఆ విద్యాగర్వం లేదు. వినయం, సమయస్ఫూర్తి అతనికి పెట్టని అభరణలు.

వీళ్ళు పెళ్ళీడుకి వచ్చారు. కాబట్టి పిల్లలకి పెళ్ళిచేయమని సీతమ్మ, రామయ్య చెవిలో జోరీగలా మ్రోగుతుండేది. ఆ ఊరి పేరయ్యను పిలిపించి కన్యల వేటలో పెట్టారు. చివరికి వారికి తగిన సంబంధాలు దొరకడంతో సంతోషించారు. పెళ్ళిళ్ళు జరిగాయి వారి వంటింటి కుండ పెద్దదైంది.

ఒక రోజు సీతమ్మ, రామయ్యతో ఏమయ్యా! మన అబ్బాయిలకి పెళ్ళిళ్ళు అయ్యాయి. కోడళ్ళూ వచ్చారు. ఇంకా నేను ఇ ఇంటి బరువు మ్రోయలేను కాబట్టి ఈ ఇంటి భాదుతలు మన కోడళ్ళకి అప్పగించాలని అనుకొంటున్నాను. వారిలో సమర్ధురాలెవరో? ఎవరైతే ఈ యింటిని చక్కబెట్టగలరో? అర్ధం కావడం లేదు. మీరే ఈ సమస్యను తీర్చాలి అమి అన్నది. అందుకు రామయ్య ,"సరే అలాగే చేద్దాం ఏది నీ కోడళ్ళను ఒకసారి పిలువు ఇక్కడికి" అన్నడు. సీతమ్మ పిలవగా కోడళ్ళంతా వచ్చి నిలబడ్డారు. రామయ్య వారితో ఇలా చెప్పారు 'అమ్మాయిలూ' నేను మీకు నాలుగు వడ్లగింజలు పెక్కబెట్టి ఇస్తాను వాటిని మీరు నేను అడిగినప్పుడు తీసుకొచ్చియివ్వాలని చెప్పాడు. కోడళ్ళు సరేనన్నారు. అప్పుడు రామయ్య ఒక్కొక్క కోడలికి నాలుగేసి గింజలు లెక్కబెట్టియిచ్చాడు వాటిని తీసుకొని కోడళ్ళు తమతమ గదులోకి పోయారు.

పెద్దకోడలు ఆ గింజలు తీసుకెళ్ళి ఒక వైపు కిటికీలోంచి బయటపారేసింది. మామగారు అడిగితే తెచ్చివ్వడానికి మన ఇంట్లో వడ్లు లేవ ఏమి? అనుకున్నది. రెండవ కోడలు ఇలా చేయలేదు. ఆమెకు కాస్త బుద్దివుంది పైగా జీర్ణశక్తి అదికం అందువలన ఆ నాలుగు వడ్లగింజలు నమిలి మ్రింగేసింది. మూడవ కోడలు వాటిని జాగ్రత్తగా పొట్లం కట్టి ఇనప్పెట్టిలో పెట్టింది.చిన్నకోడలు ఏమి చేసిందో తెలియదు కాని గబగబా తనగదిలో కెళ్ళి ఏదో ఉత్తరం వ్రాస్తుంది ఇవన్నీ రామయ్య, సీతమ్మలు చూస్తున్నారు.

నాలుగేళ్ళ తరువాత సీతమ్మ మరలా పోరు పెట్టింది. నామిద ఉన్న కుంపటి దింపేసుకోవాలని. రామయ్య చేసేది లేక కోడళ్ళను పిలిచాడు. అమ్మా! మీకు నేను ఇచ్చిన నాలుగు వడ్లగింజలు తీసుకురండి! అన్నాడు అప్పుడు పెద్దకోడలు గబగబా వడ్లగదిలోకి వెళ్ళి, నాలుగు గింజలు తెచ్చి యిచ్చింది రెండవ కోడలు కూడ తన అక్కను అనుసరించింది.మూడవ కోడలు తన గదిలో పెట్టెలో దాచిన పొట్లం తీసుకువచ్చి మామగారి చేతికిచ్చింది. చిన్న కోడలు మాత్రం బెల్లంకొట్టిరాయిలాగా నిలబడుకోనివుంది. ఏమమ్మా ! నీకిచ్చిన నాలుగు గింజలు అన్నడు మామగారు నాకు నాలుగు రోజులు గడువివ్వండి తెచ్చియిస్తాను అన్నది. ఇంట్లో ఉన్న గింజలు తీసుకురావడనికి నాలుగు రోజులెందుకు?

అనుకున్నాడు కానీ కాదనలేక సరేనన్నాడు.
మూడు రోజుల తరువాత, అంటే నాల్గవ రోజు ఉదయం రామయ్య వీదిలో అరుగుమీద కూర్చొని పళ్ళలోపుల్లేసుకోని ఉన్నాడు.ఎదురుగా నాలుగు ఎడ్లబండ్లు వస్తున్నాయి. అవి వడ్లబస్తాలను తోలుకువస్తున్నాయి అవి నేరుగా వచ్చి రామయ్య ఇంటి ముందు అగాయి. ఆ బండిలోంచి ఒక వ్యక్తి దిగి రామయ్య దగ్గరకు వచ్చాడు. అతడు ఎవరో కాదు! రామయ్య చిన్న కోడలి తండ్రి. ఓ బావా! నువ్వా ఏమిటి ఈ ఎడ్లబండ్లు ఎవరివి? వీటితోపాటు నువ్వు వస్తున్నావేమిటి? అన్నాడు రామయ్య.ఇవి మనవే అమ్మాయి కబురు పెట్టింది. అందువలన తోలు కువచ్చాను అన్నాడు వియ్యకుడు ఇద్దరూ కలసి ఇంట్లోకి వెళ్ళారు.
రామయ్య చిన్నకోడలిని పిలిచి, అమ్మాయి ఇవి ఎవరివి? ఎందుకు తోలుకురమ్మనావు అన్నాడు అందుకు చిన్నకోడలు "మామగరు!ఇవి మనవే మీరు నాకు ఇచ్చిన నాలుగు వడ్లగింజలము మా నాన్నగారి ఇంటికి ఇచ్చిపంపించాను వాటిని మా నాన్న ఒక పాదులో నాటాడు,అవి ఒక దోసెడు వడ్లనిచ్చాయి. వాటిని మరలా నాటాడు. ఒక కుంచెడు వడ్లనిచ్చాయి. వాటిని మరలా నారుపోసి, వరిపండించాడు. ఇలా నాలుగు గింజలను పెంచి, నాలుగు బండ్ల వడ్లను చేశాడు" అని చెప్పింది ఆమాటటలకు రామయ్య ఆశ్చర్యపోయాడు. కొద్ది సేపటికి తేరుకోని, తన ఇంటిలోని వారందరినీ పిలిచాడు.
అప్పుడు రామయ్య వారితో ఇలా అన్నాడు నేను ఈ ఇంటి బాధ్యతలను ఈ నలుగురు కోడళ్ళలో ఒకరికి అప్పగిద్దామనుకున్నాను. అందుకు పరీక్షగా నాలుగు వడ్లగింజలిచ్చాను. నేను కోరినప్పుడు వాటిని తిరిగి ఇమ్మన్నాను. పెద్దకోడలు వాటిని తీసుకెళ్ళి బయటవేసింది. ఆమెకి మాటమిద నిలబడే గుణం లేదు, నిర్లక్ష్యం చేసింది అందువలన ఈమెకు ఈ ఇంటి పాచిపని అప్పగిస్తున్నాను, రెండవ కోడలు వాటిని నమిలి మ్రింగేసింది. ఈమెకు జీర్ణశక్తి ఎక్కువ. ఆహారప్రీతి కూడా దండిగానే ఉన్నది. అందువలన ఈమెకు వంట భాద్యత అప్పగిస్తున్నాను. మూడవ కోడలు వడ్లగింజలను జాగ్రత్తగా పొట్లంకట్టి పెట్టెలో పెట్టింది కాబట్టి ఈమెకు డబ్బు, నగలు రక్షించే బాధ్యత ఇస్తున్నాను. ఇక నాలుగు వడ్లగింజలను నాలుగు బండ్లగింజలుగా చేసిన చిన్నకోడలికి ఈ ఇంటి మీద సర్వహాక్కులు ఇస్తున్నాను. వడ్లగింజలలాగే మన సంసారాన్ని పదింతలు చేయగలదన్న నమ్మకంతో ఆమెకు ఈ బాధ్యత అప్పగిస్తున్నాను అన్నాడు. ఆ మాటలు అన్నాడో? లేదో! సీతమ్మ తన చేతిలోని తాకంగుత్తి కోడలి చేతిలో పెట్టింది. భగవద్గీత, జపమాల పుచ్చుకుంది.